# షోకుపిల్లి

మధ్యాహ్నం ఒంటిగంటయింది. ఊరంతటినీ ఎండ తినేస్తోంది. ఊరవతల పార్కుకి పక్కగా బీచికి దగ్గరగా పచ్చటి చెట్లచాటున దాగున్న రావుగారి బంగళాలో 'చల్లటి' భోజనాల గదిలో ట్యూబ్‌లైట్ వెలుగుతోంది. లైటుకింద బల్ల దగ్గర కుర్చీలో కూర్చొని రావుగారు భోజనం చేస్తున్నారు. ఎదురుగా ఆయన భార్య ఉంది. ఇద్దరికీ కాలం మళ్లినా వాళ్లు ఇంకా వయ్యారం చెడిపోని ముసలి సత్యభామా కృష్ణుళ్ళా కనిపిస్తున్నారు. రావుగారి భార్యకి తల కొంచెం నెరసినప్పటికి గుండెల్లో బిగువు చెడిపోలేదు, బాగా ముదిరిన పనసమానులా రావుగారు చేవగా కనుపిస్తున్నారు. రావుగారికి కుడిపక్కగానూ ఆయన భార్యకి ఎడంపక్కగానూ బల్లకి మరో అంచున వారి కుమార్తె మిస్ మాలినీరావు కూర్చొనుంది. ఆమెకి ఇరవయ్యేళ్ళుంటాయి. ముప్పయ్యేళ్లొచ్చినా ముద్దులు కుడిచే పిల్లలా ఉంటుందామె. తెల్ల చొక్కా, తెల్ల పంట్లాం తొడుక్కున్న ఎర్రటి నాయరు కుర్రవాడు ముగ్గురికీ సర్వ్‌చేస్తూ బల్లకి దగ్గరగా వస్తూ పోతూ ఉన్నాడు.

రావుగారి భార్య రావుగారితో ఏదో గబగబా చెప్పుకుపోతోంది. ఆవిడ కంఠం ఏమంత మధురంగా లేదు. ఇంగ్లీషులో కొంతసేపూ, తెలుగులో కొన్ని మాటలూ మాట్లాడుతోందావిడ. రావుగారు భోజనం చేస్తూ భార్య చెప్పేదంతా శ్రద్ధగా వింటున్నాడు. మాలినీరావు తల్లి వల్లించే మాటల్ని వింటున్నట్టుగా లేదు. మసిగీతల్లా ఆమె ముఖంనిండా విచారరేఖలు కన్పిస్తున్నాయి. భుజాలదాకా కత్తిరించిన ఆమె ఉంగరాల జుట్టు చెదురుమదురుగా రేగిపోయి ఆమెలోని శోక తీవ్రతని స్పష్టంగా తెలియజేస్తోంది.

"మన డ్రైవరు దీనికంతటికీ కారణం, ఈ మిస్చిఫ్ అంతటికీ వాడిదే మెయిన్ రెస్పాన్సిబిలిటీ! ఈ అల్లరంతటికీ వాడే ముఖ్యకారణం!" అంటూ ఎర్రటి పచ్చి బీట్‌రూట్ ముక్కలోకి కసిగా ఫోర్కు దూర్చి, ఆ ముక్క ఎత్తి నోట్లోకి లాక్కొని కసకస నములుతూ ఖచ్చితంగా ఫైనల్‌గా చెప్పింది.

సంగతి ఏఁవిఁటీ అంటే!

నందూబేబీ - (నంద్‌మోహన్ - నందూబేబీ 25 సం.లు: 5'10", 188 పౌన్లు, బి.ఎస్‌సి. (పొలిటికల్ సైన్స్)(లన్డన్)(మాజీ) దివాన్ బహద్దూర్ రావ్, ఫేమస్ బిజినెస్‌మన్‌గారి కొడుకు. హాబీస్ వెస్టర్న్ మ్యూజిక్ అన్డ్ఎన్షెన్ట్ అమెరికన్ స్కల్ప్‌చర్); గేమ్స్ - క్రికెట్, టెన్నిస్ అన్డ్

బిలియర్డ్స్; బుక్స్ - డాస్టవస్కీ, ఆస్కార్ వైల్డ్ అన్డ్ మామ్. నందూబేబీ ఈ మధ్య ఏదో పిచ్చెత్తినవాళ్ళా "క్రేజీ"గా సంచరిస్తున్నాడు. ఏదో పిచ్చి ప్రేలాపన పేల్తున్నాడు. పతితులూ, భ్రష్టులూ బాధా సర్వ సో అన్డ్ సో అంటున్నాడు. రావుగారి భార్యకి ఆ మాటలే బోధపడ్డంలేదు. "నెవర్ హర్డ్ సచ్ రిగ్మరాల్ ఇన్ ఆల్ మైలైఫ్". అటువంటి అర్థంలేని చెత్తని ఆవిడ జీవితంలో అంతవరకు ఎప్పుడూ వినుండలేదు. మొన్న ఈమధ్య ఎవరో రచయితల్ట ఏదో సభట? హుపెనీ టపెనీ ఫెలోస్ అంతా కలిసి మీటింగు పెడితే నందూబేబీ వాళ్ళందరికీ మన కార్లు రెండు లెన్డ్ చేసేడు. వాళ్లతోపాటు సోషలిజం, ఈక్వాలిటీ, ఇజాలిటేరియన్ సొసైటీ అని ఏవేవో మాటలంటున్నాడు. 'ముద్దకులేని ముష్టివెధవల్ని' తీసుకొచ్చి వాళ్ళకి బ్రాందీ, విస్కీ ఇప్పిస్తున్నాడు. డీసెంట్ కంపెనీలో మద్యం సేవించినా, మరేం చేసినా ఫరవా అంతగా ఉండదు. నాకు పెద్దగా అబ్జక్షన్ లేదు. మీక్కూడా తెలుసు. కాని పాటగాళ్ళూ, ఆటగాళ్ళూ, రాతగాళ్ళూ, అలాంటి వెధవలు కూడా పెద్దమనుషులే నన్చెప్పి వాళ్ళతో నందూబేబీ ఆ విధంగా సంచరిచడం చూస్తే రావుగారి భార్యకి గుండెల్లోంచి భయమూ, కోపమూ కూడా పుట్టుకొస్తున్నాయి.

అన్నింటికంటే మించిన ఘోరం ఏఁవిటంటే :

ఏవరో సరసిజాక్షిట!

ఏ కాల్ గర్ల్! ఏ ప్రాస్! ఏ బిచ్!

నందూబేబీ ఆ పిల్లని పట్టుకొని వదలకుండా ఉన్నాడు. రావుగారి భార్య తలెత్తుకు తిరగలేకుండా ఉన్నది. ఊరంతా నందూ, సరూల ప్రణయగాథ గురించే వింతగా చర్చించుకొంటున్నారు. సొసైటీలో ఎక్కడికి వెళ్ళినా రావుగారి భార్యని చూసి అంతా తమ గుసగుసలు అపుచేసి ముఖముఖాలు చూసుకొని నవ్వుకొంటున్నారు. షోకైన మగపిల్లలు చెడిపోయిన ఆడదాన్ని చెరచడం వేరు, ఆ "చెరచడాన్ని" ప్రేమ పేరుతో సమసమాజ సిద్ధాంతంలో సమర్థించడం వేరు. అందుచేత నందూ సరూల ప్రణయగాథ ఫలితంగా పట్టణ రక్షణ అడ్‌హాక్ కమిటీ లోంచి రావుగారి భార్య పేరు జారిపోయింది. కామీపిల్లాడి తల్లికి రక్షణ కమిటీల్లో స్థానం ఉండకూడదని వాళ్ళంతా నిర్ణయించేరూ అంటే వాళ్ళదా తప్పు?

"ఇదంతా మన డ్రైవర్‌గాడే చేసేడు! వాడే! ఆ వెధవే! అని ఉక్రోషంతో అంది రావుగారి భార్య. మరొక బీట్‌రూట్ ముక్క నములుతూన్న ఆమె నోరు మేకని కొరికిన పులినోర్లా తెరుచుకు మూసుకొంది. పెదవులు బిగించి దవడలు మాత్రం ఆడిస్తూ ఆవిడ విచారంగా కూర్చుంది.

రావుగారు భార్యవైపు ప్రశ్నార్థకంగా చూశారు.

"మన డ్రైవర్‌గాడి ముండే అది. దాన్తో వాడు నాటకాల్లో వేషాలు వేయిస్తాట్ట. దాన్ని మన బేబీకి వాడే ఇంట్రడ్యూస్ చేసుండాలి. వాడే దీనంతటికీ కారణం!" అని మరొకసారి ఆఖరిసారిగా చెప్పింది రావుగారి బార్య.

రావుగారి భ్రుకుటి ముడిపడింది.

అంతలో మిస్ మాలినీరావ్ భోజనం చెయ్యడం అపుచేసి ప్లేట్లోకి స్పూనూ, ఫోర్కూ టక్కుటక్కున పడేసి-

"నందూని డ్రైవర్ పాడుచేస్తే లూసీని నువ్వు పాడుచేసేవు, నువ్వే పాడుచేసేవు! నువ్వే - నువ్వే!" అంది తల్లిని తన సక్రోధ జలనయనాల్తో కార్చి ముంచేస్తూ.

తల్లీతండ్రీ కూడా కుమార్తెవైపు ఆశ్చర్యంతో చూసేరు. ఆ పిల్ల వళ్ళు తెలియని బాధతో నాప్‌కిన్‌తో (!) కళ్ళు తుడుచుకొంది.

"లూసీకి ఏఁవిఁటొచ్చింది!" అని అడిగేరు రావుగారు. ఆయనకి చాలా చిరాగ్గావుంది. ముఃణ్నెల్లయి ఆయన ఊళ్ళో లేరు. పైదేశాల నుంచి మదుపులు సంపాదించడం గురించి ఆయన వెస్ట్ జర్మనీ, గ్రేట్ బ్రిటనూ, (అమెరికన్ సంయుక్త) రాష్ట్రాలు వెళ్ళి తిరిగి తిరిగి చివరికి ఈరోజు పొద్దున్న పదకొండు గంటల ప్లేన్‌కి దిగేరు. దిగిన తరువాత హాయిగా ఉండనివ్వకుండా ఇంట్లో టుమ్రీటుమ్రీ గొడవల్తో అవతల భార్యా, ఇవతల కూతురూ కలిసి ఆయన ప్రాణం పీక్కుతింటున్నారు.

కూతురు మాట్లాడకపోవడం చూసి, "లూసీకి ఏఁవిఁటొచ్చింది మాలీ?" అని విసువుని విచారంతో కప్పుకొని అడిగేరాయన.

మాలినీరావ్ వెంటనే జవాబు చెప్పలేదు. ఆమె తన బాధని "బ్రేవ్"గా దిగమింగుకొందికి ప్రయత్నం చేస్తూంది.

ఏడాది కిందట పిల్లులు సడెన్‌గా ఫాషన్లోకి వచ్చి అప్పణ్నించీ కూడా పాప్యులర్‌గా అలా నిల్చిపోయాయి. సరళా నాయర్ ఇంటికొక చక్కని పిల్లిపిల్ల వచ్చేసరికి సుజాతానయ్యర్ తన కార్లోకి సరికొత్త పిల్లిని తెచ్చిపెట్టుకొంది. క్వీనీ డేవిడ్ డ్రాయింగ్ రూంలో మెరుపువంటి పిల్లి కనిపించేసరికి కాథరిన్ శాస్త్రి బెడ్‌రూంలో వెన్నెలవంటి పిల్లి వెలిసింది. ఇందిరాఖాన్ ఇంట్లో గది కొక పిల్లి తయారయేసరికి నొబొనితో మొఖర్జీ ఇంట్లో అయిదు పంచరంగుల పిల్లులు అవతరించేయి. అందరితోపాటు మాలినీరావ్ కూడా ఎంచుకొని ఎంచుకొని ఒక మంచి పిల్లిని తెచ్చుకొంది. అందరికి ఆల్, కే. ఫోన్, లెగ్స్ డైమండ్ వగైరాలు ఇష్టలైతే మాలీనీరావుకి మాత్రం లకీలూసియానో అంటేనే ఇష్టం. అందుచేతనే తన పిల్లికి ముద్దుగా ఆ పేరు పెట్టుకుంది. షోకైన ఆ పిల్లి కష్మీర్ టైగర్లా గంభీరంగానూ, కెనడా (లో) మంచులా తెల్లగానూ, ఖద్దర్ సిల్కులా మెత్తగానూ, అమెరికన్ "బ్రా" లా అతి మనోహరంగానూ ఉంటుంది.

మాలినీరావ్‌కి కాలం అంతా హాయిహాయిగా వెళ్ళిపోతూండగా ఆ కాలానికి సడెన్‌గా బ్రేక్‌పడింది. మురిసిపోయే రామచిలక్కి తలపువార పిల్లి పొంచుంంటుందని ఇప్పటిదాకా తెలియనట్లు మాలినీరావ్ పెంచుకునే లక్కీలూసీకి ఊళ్ళో పార్కువాడు నిప్పరంగు కత్తులకోణ్ని పెంచుతున్నాడని మొన్నటిదాకా తెలియకుండా పోయింది.

మొన్నటి దినం పార్కులో సాయంకాలపు శోభలో అంతా కలిసి కూర్చున్నప్పుడు మాత్రం పార్క్ కాపలావాడి కోణ్ణిచూసి లకీ లూసీ బెదిరిపోయి జడుసుకొంది. నిప్పల్చిమ్మే కోళ్ళుఁటాయని దానికి ("వాడికి") ఆ క్షణమే తెలిసొచ్చింది.

ఆ క్షణం నుంచీ మాలినికి మతి చెడిపోయింది.

అమెరికన్ కన్య లా సరళ నవ్వింది. బ్రిటీస్ అమెజాల్లా సుజాత నవ్వింది. క్వీనీ

కథా నిలయం
56



వికవిక నవ్వగా కిట్టీ ప్రకటలి నవ్వింది. ఇందిర తురక నవ్వు నవ్వగా, నాబౌనీ మాత్రం ఆచార్యులవార్లా శాంత గంభీరంగా మందహాసం చేసింది. "మీ అమ్మగార్తో కలిసి దివ్యజ్ఞానం నేర్చుకొంటుందా మీ పిల్లి?" అని ఒకరు! "మీ బ్రదర్సు రైటర్స్ కాన్ఫరెన్సుకి వెళ్తోందా?" అని ఒకరు, "మాలీ! మాలీ! నీ పిల్లి శాంతియుత సహజీవ పిల్లిలాగుందే?" అని మరొకరు! "ఇది మన నందూబేబీలా సోషలిస్టు పిల్లి కాబోలు" అని ఇంకొకరు - ఇలా అంతా కలిసి లూసీని హేళన చేసేరు పూర్ లూసీకి "అహింస పిల్లి" "వెజిటేరియన్ పిల్లి" "సోషలిష్టు పిల్లి" అంటూ పేర్లు పెట్టి నానా వెక్కిరింతలూ వెక్కిరించేరు.

జరిగిన అవమానం గురించి తల్చుకొంటూంటే మాలినికి దుఃఖం ఆగడంలేదు. ఇందిరాఖాన్ తన బంగారప్పన్నుని మెరిపిస్తూ, "నీపిల్లికి పీస్ ప్రయిజు ఇవ్వొచ్చు మాలీ!" అంది, తల్చుకొంటుంటే మరింక కోపం ఆగడంలేదు మాలికి.

కోడి కోడి ఆఫ్టర్ ఆల్ ఎ పెటీ కోణ్ని చూసి జడిసిపోయి తలవంపులు తెచ్చిపెట్టింది పాడు పిల్లి! నేరకపోయి పేరు పెట్టినందుకు అమెరికన్ అన్డర్ వరల్డ్ హీరోకి కూడా తెచ్చిపెట్టింది చెడ్డపేరు.

"నువ్వే సుమీ, నువ్వే దీనంతటికీ కారణం! పిల్లిని పిల్లి బతుకు బతకనివ్వకుండా దాన్ని ఆ పాడు థియసాఫికల్ మీటింగ్స్‌కి పట్టుకువెళ్ళేవు. నేనెంత చెప్పినా వినకుండా ఆమధ్య ఆ యూస్‌లెస్ నానామతాల కాన్ఫరెన్స్‌కి దాన్ని ("వాణ్ణి") మోసుకెళ్ళేవు. అది చాలదన్నట్టు ఆ నందూబేబీతో దాన్ని రచయితల సభలకి పంపించేవు. ప్రేమా, శాంతీ, సహనం, సహజీవనం, సత్యం, అహింసా ఇటువంటి నాన్సెన్సంతా చెవుల్లోకి ఎక్కుతూంటే మనుషులు మారినట్టే, ఆ వాతావరణంబట్టి పిల్లులు కూడా అన్‌కాన్షస్‌గా మారిపోవచ్చు. పూర్ లూసీ అందుకే అలా మారిపోయేడు? మొన్న కోడిన్చూసి బెదిరేడు - ఇవాళ ఎలకన్చూసి భయపడతాడు. రేపు చిలకన్చూసి దాగుంటాడు, గుండుచేసి కాషాయవస్త్రాలు కట్టడం మినహా ఆ పిల్లికి అటువంటివన్ని మర్యాదలూ చేసేవు నువ్వు. ఆఖరికి మాంసం కూడా మాన్పించేసి, దాన్ని చివరకొక చచ్చు చెవలపిల్లిలా తయారుచేసేవు!"

అని తల్లిమీద విరుచుకుపడిపోయింది మాలినీరావ్.

కథంతా కూతుర్నడిగి తెలుసుకున్నాక రావుగారికి చిరునవ్వొచ్చింది. ఆ చిరునవ్వుతో ఆయన చిరాకంతా ఎగిరిపోయింది. చిరాకంతా పూర్తిగా పోవడంతో ఆయనకి పెద్దగా నవ్వొచ్చింది. భోంచేస్తూ చేస్తూ ఆయన "మనింట్లో ఇద్దరు సో .... ఇద్దరు సో .... ఇద్దరు సోషల్లిస్టులన్నమాట!" అంటూ విరగబడి నవ్వేరు. ఆ నవ్వుకి నాయరు కుర్రవాడు పక్క గదిలోంచి వస్తూ వస్తూ గుమ్మంలో బొమ్మలా నిలబడిపోయేడు. మాలిని ఆ నవ్వు చూసి తన దుఃఖం సంగతి మర్చిపోయింది. రావుగారి భార్య మాత్రం సీరియస్‌గా "నేను మీ నవ్వుని వ్యతిరేకిస్తున్నాను!" అని నాక్కి వొక్కాణించే ప్రతిపక్ష సభ్యురాల్లా తీవ్రంగా చూస్తూ కూర్చుంది.

నవ్వులోంచి బైటపడ్డాక స్పూన్తో మూతి తుడుచుకొంటూ, "మాలీ! నీ పిల్లికి వచ్చిన భయం ఏమీలేదు. మరేం చెడిపోదది! భయపడకు" అని హామీ యిచ్చేడు రావుగారు.

"చెప్పడం ఈజీవే" అంది మాలిని ముద్దుగా.

"డోన్టు బి సిల్లీ! లెక్చర్లు విని పిల్లలు మారిపోవడం ఏఁవిఁటి!? సూపర్‌స్టిషస్ ప్రిమిటివ్-రాతియుగం మనిషిలా మాట్లాడకు?" అన్నారు రావుగారు.

"ప్రిమిటివ్‌గా రాతియుగం మనిషిలా ఉండటవేఁ నా కిష్టం!" అంది మాలిని డిఫమెంట్‌గా.

అందుకు జవాబుగా రావుగారు ఫోర్కుతో తన భార్యని కుమార్తెకి చూపిస్తూ "మీ అమ్మ ఎన్ని ఉపన్యాసాలు వింది?" అని అడిగేరు.

"కొన్ని వేలు."

"అన్ని వేల వేదాంతోపన్యాసాలు మీ అమ్మని మార్చగలిగేయా?"

అసందర్భంగా మాట్లాడకండి!" అంది రావుగారి భార్య.

"కొన్ని టన్నుల అహింసని మీ అమ్మలోకి ఎక్కించినా మీ అమ్మ మారదు. నీ పిల్లి కూడా అలాగే!"అన్నారు రావుగారు.

"మరి నందూబేబీ మారిపోలేదేంటి?" అంది మాలిని తండ్రిపై ఒక పాయింట్ స్కోర్ చేస్తూ.

రావుగారు మనోహరంగా యుద్ధం ముందు అర్జనుణ్ని చూసిన కృష్ణుళ్ళా నవ్వేరు.

"పిల్లికి మెదడు పెరగదు కాబట్టి అదెప్పుడూ పిల్లిగానే ఉంటుందని తెలుసుకోండి! యు కేర్‌పుల్లీ ఫాలో మీ మనుషులలా కాదు. ప్రతి మనిషికూడా పుట్టగానే తను పులిలా బతకాలో, ఆవులా బతకాలో, మేకలా బతకాలో తేల్చుకోడు. జ్ఞానం వచ్చేక తేల్చుకొంటాడు. పెద్దయాక తనదే జాతో స్థిరపర్చుకుంటాడు. ఆ రకంగా మీ అమ్మా, నేనూ మా-ంటి వాళ్ళూ అంతా ఏనాడో మాజాతి స్థిరపర్చుకున్నాం. నందూబేబీ ఇంకా ఆ విషయం తేల్చుకోలేదు. రేపోమాపో తేల్చుకొంటాడు. మరేం ఫరవాలేదు" అన్నారు రావుగారు ఉపన్యాస ధోరణిలో.

"అప్పుడైనా ఎలా తేల్చుకుంటాడు?" అంది రావుగారి కుమార్తె.

పరిస్థితి సడెన్‌గా విషమిస్తే!" అన్నారు అందుకు జవాబుగా రావుగారు.

"పరిస్థితులు ఎలా విషమిస్తాయి?" అంది మాలిని.

"ఏదైనా క్రయ్‌సిస్ వచ్చినప్పుడు. దాన్నే పరిస్థితి విషమించడం అంటారు."

"అదెలా వస్తుంది?"

"అది భగవంతుని కరుణ, ప్రయత్నం మనది. అనుగ్రహం వాడిది" అన్నారు రావుగారు వేదాంత ధోరణిలో.

తరువాత, భోజనాలయాక రావుగారు తన స్నేహితుడైన పోలీస్సూపరింటెండెంట్ అవతార్‌గారికి ఫోన్ చేశారు. ఆ తరువాత డ్రైవర్ని పిలిపించి ఏదో మాట్లాడేరు. అప్పటికి రెండు గంటలయింది.

మర్నాడు రాత్రి క్లబ్బులో చేతిలో ఉన్న పేకముక్కలు బల్లమీద పడేసి కుర్చీలోంచి లేచి స్నేహితులందరికీ బై బై టా టా చెప్పేసి నందూబేబీ బైటకి వచ్చి కారెక్కి బయల్దేరేసరికి

సరిగ్గా రాత్రి పది గంటలయింది. వెన్నెల్లో చెరువులా వున్న ఆకాశంలో చంద్రుడు పడుచుదాని ప్రియుళ్ళా గర్వంగా వెలుగుతున్నాడు. నందూబేబీ క్లబ్బులోంచి ఠంచన్‌గా పది గంటలకి వచ్చేస్తూవుంటే కొంతమందతణ్ని వెటకారం చేసేరు. బేఖాతర్‌గా బైటికి వచ్చేసి రాజాగా కారెక్కాడు నందూబేబీ. అందానికి జాతి భేదం లేదని అతనికి గట్టి నమ్మకం ఉంది. స్వేచ్ఛా ప్రపంచంలో పెద్ద స్థాయికి వెళ్ళడానికి ప్రతివాళ్ళకీ హక్కూ, అవకాశమూ ఉన్నాయి. అందానికీ, డబ్బుకీ ఎన్టర్ ప్రయిజుకీ ఆ అవకాశాలు ఎక్కువుంటాయి. వాటిలో సరూకి అందం ఉంది. ఆమెకి భగవంతుడా అందం ఇచ్చేడు.

పదిహేన్రోజులయి అందాన్ని కారుమీద ఊరేగిస్తున్నాడు నందూబేబీ. సరిగ్గా పదింపావుకల్లా సిద్ధంగా ఉంటుంది సరూ. ఇద్దరూ కలసి ఊరికి దూరంగా పోయి బీచిలోనో లేక కార్లోనో కూర్చుంటారు. వెనుక సీట్లోనో లేక బైటో డ్రైవరు డిస్క్రీట్‌గా ఉండీవుండనట్టు అణిగిపోయి దాగుంటాడు. డ్రైవరు పక్కనుంటే "చాలా సేఫ్‌మనకి" అని సరూకి తొలినాడే నచ్చజెప్పేడు బేబీ.

నెమ్మదిగా డ్రైవ్‌చేస్తూ ఏదో ఆలోచిస్తూ చిరునవ్వు నవ్వుకున్నాడు బేబీ. అతను వారం దినాల్లో బొంబాయి వెళ్ళిపోతున్నాడు. డాడీకి ఇంకా ఆ భోగట్టా తెలీదు. "పూర్ డాడీ", ఈ బేబీకి బుద్ధితో పాలుపెట్టి పెంచాలని చూస్తున్నాడు. "ఎన్టర్‌ప్రయిజింగ్ రెక్కలొచ్చా"యని ఆయనకి తెలీదు. బొంబాయి నగరాన్ని కొమ్ములు పట్టి తిప్పగల శక్తి ఈ బేబీకి ఉందని ఆయనకి ఇంకా తెలీదు. వారం రోజుల్లో తెలుస్తుంది! కాని ప్రస్తుతం --

బేబీ చిరునవ్వుక్కారణం డాడీ కాదు, సరూ. తను బొంబాయి వెళ్ళిపోయాక సరూ ఏం చేస్తుందోనని అతను ఊహించుకొంటున్నాడు. మూడు గమ్మత్తయిన ఊహలు తట్టేయతనికి (1) సరూ భగ్న ప్రేమికురాలై ఆత్మహత్య చేసుకోవచ్చు. ఆ వార్త తనకి ఓ పదేళ్ళనాడు తెలుస్తుంది. ఆ రోజున తనెందుకంత విచారంగా ఉన్నాదో అర్థంకాక తన భార్య గాభరా పడుతుంది. (2) సరూ ఆత్మహత్య చేసుకోకపోవచ్చు : ఆత్మహత్య చేసుకోదు. ఏ అభాగ్యుణ్నో పెళ్ళాడి వాళ్ళనే తన నందూబేబీని చూసుకొంటూ దినాలు గడుపుతుంది. భర్త నామె "బేబీ నా బేబీ" అని పిలుస్తుంది. ఆ దౌర్భాగ్యుడు ఆమె తననే అలా పిలుస్తోందనుకొని పరవశుడైపోతాడు. (3) సరూ పెళ్ళిచేసుకోకపోవచ్చు. నాటకాల్లోంచి సినిమాల్లోకి మారిపోయి తెలుగు సినిమాల్లోంచి హిందీ తెరమీదకి ఎక్కిపోయి లక్షల్లక్షలు గడించి పారేస్తుంది. ఆ ఆస్తంతా .... "రిజిష్టర్డు విల్! ...." అంతా చదివి ఆశ్చర్యపోతారు. "మధుర ప్రేమ" మహిమను చూపించిన నందూబేబీకి నా యావదాస్తీ .... .... .... ఎవరీ నందూబేబీ? ఎవడీ లకీగై??

బేబీ నవ్వుకున్నాడు.

రోడ్డుకి అటువైపున పెద్ద బయలుప్రదేశం ఉంది. ఊళ్ళో మురికంతా అక్కడే ఉంటుంది. పగలూ - రాత్రీ ప్రతిరోజూ కంపు కొడుతుంది. రోడ్డుకి ఇటువైపున చిన్న చిన్న పెంకుటిళ్ళున్నాయి. అన్నీ కొట్లు కొట్లుగా ఉంటాయి. ఆ ఇళ్ళల్లో ఎలక్ట్రిక్ దీపాలుండవు. మనుషుల కళ్ళల్లో కాంతులుండవు.

సరూ ఇంటికి ఎదురువైపున రోడ్డువార నందూబేబీ కారు ఆపేసరికి సరూ ఇంటిచుట్టూ యాభై అరవై మందిదాకా జనం మూగివున్నారు. సగంమంది బుగ్గలమీద వేళ్ళు వేసుకున్న

ఆడవాళ్ళు, మిగతా సగంలో సగంమంది చిన్న చిన్న పిల్లలు, మిగతావాళ్ళు చెడ్డీలు మాత్రం తొడుక్కొని చెంబులు పట్టుకొని చుట్టలూ, బీడీలు కాలుస్తూ నిల్చున్న "గూండాల్లాంటి" శాండో జనం - సరూ ఇంటి కొట్టుముందు మెట్టుమీద నిల్చుని వంటసారా తాగినవాళ్ళా ఒకతను లెక్చరిస్తున్నాడు. అతనికి యాభయ్యేళ్లుండొచ్చు. కొట్లోంచి వచ్చే టేబిల్ లైటు కిరసనూనె వెలుగులో అతని ఎర్రగళ్ళ కొత్త లుంగీ భగభగలాడుతోంది. పసుప్పచ్చ బనీను వెలవెలపోతోంది. విఠల్ క్రాపులా దువ్వుకున్న అతని పండుజుట్టు అతనొక పాతకాలపు స్టేజీ మనిషని తెలియజేస్తోంది.

"నేను పరువుగా బతికేను. పుండాకోర్ మనిసిని కానే కాను. మర్యాదగా, గౌరవంగా బతికేను. శేర్మన్ గారింటికెళ్ళినా మనకి కుర్చీయేసి కూకుండబెట్టి మాట్లాడారేగాని నిలబెట్టి మాట్లాడకూడదే! నాకా గౌరవం దేన్నిబట్టొచ్చింది. దేన్నిబట్టి నలుపురు పెద్దల మద్దా నేనా మ్మరియాద సంపాయించేను! డబ్బుబట్టా?" అన్నాడతను.

"నీతుండాలి గాని డబ్బేటి తెస్థి" అన్నాడొక చెంబు.

"డబ్బేటి తెస్తా?" అని ప్రశ్నించి, "నెత్తిక్కళ్ళు," అని జవాబు చెప్పింది మరొక చెంబు.

"నీతిలేని బతుకు అదేటి బతుకు!" అన్నాడొక బుగ్గమీది వేలు.

"రోజుకో మొగుణ్ణిడుకొని కనకమ్మ కూతురూ సంపాయించింది డబ్బు!" అంది మరొక వేలు.

"అప్పని పెట్టీ ఆఫీసరి కప్పజెప్పి సారాకొట్టెట్టి సాయిత్రి తమ్ముడూ గడిచ్చేడు. మూటలు మూలిగితే మాత్తరం మరియాదా వస్తాదేటి?" అన్నాడొక పడుచు బుగ్గ.

గళ్ళలుంగీ మళ్ళీ అందుకుంది. డబ్బంటే మనకి గెడ్డిపరక! నీకు నీతి కావాలా లేకపోతే లచ్చరూపాయలు నోటు కావాలా అని మీరంతమందీ అడగండి నన్ను లచ్చసార్లడగండి? లచ్చసుట్లు కూడా నీతే కావాలనే మనిసిన్నేను? అలాటి అర్మనీ సింవాశెలం మేనకోడలు కారుకోసరం పడుకొంటోందంటే అది నా వొంశేనికి మచ్చ అవునా? కాదా?" అని పెనుబొబ్బపెట్టి ఎదురుగా అప్పుడే ఆగిన కారువైపు చెయ్యి జాచి ప్రాసిక్యూటరు ముద్దాయిని చూపించినట్టు చూపిస్తూ. "అదిగో కారు! కారదిగో! ఈడికోసరం దాసిబెట్టినట్టు పారొచ్చేడు. ఈడికారెక్కించడానికీ ఈడి మంచవెక్కించడానికేనా నాయప్ప కూతుర్నికంది? మనకి మనిళ్ళల్ల అందానికి ఊర్వశీ మోయినీ తిలోత్తమలున్నారు. నీతికి సీతా సాయిత్రి దమయంతులున్నారు. కారున్న లంజాకొడుకుల కప్పజెప్పడానికేనా మనిళ్ళల్ల మనకి ఆడోళ్లున్నారు?? ఏటంటారు? నేనడిగింది రైటేనా? అంశేత కారు దిగమనండి - లంజాకొడుకుని!! దింపి అడగండి! పిల్లని పెళ్లాడితే ఆడమనండి! లేకపోతే డోన్టాగ్గెటౌట్‌కికా పన్జెప్పండి! అర్మనీ సింవాశెలం మేనకోడలు అప్పనంగా ఎక్కించుకుపోడానికి ఎవుడికి లేదిక్కడ! నీతికి నిజాయితీకి నిలబడాలనుకుంటే మరియాదగా కారు దిగమనండి! లేకపోతే ఇదిగో! పెద్దయీది పులి గట్టు దిగుతోంది! ఈకలంటే ముసలైపోయేయిగాని నా సేతులు ముసలైపోలేదు. పిడికిలి బిగించి గుద్దేనంటే ఫిరంగిదెబ్బ! కమాన్ పెద్దయీది సింవం రంగంలోకి దిగుతోంది! అడ్డు లెగండి? అడ్డు లెగండి? అంటూ ఎర్రగళ్ళ లుంగీ రోడ్డుమీదికి ఉరికింది.

అల్లరి, ఘర్షణ, గోల, కారుచుట్టూ కెరటాలు కెరటాలుగా జనం కార్లోంచి బైటకొచ్చిన డ్రైవర్ని ఇద్దరు తన్నడం, గళ్ళలుంగీని ఒకరిద్దరు ఆపబోడం, ఆడవాళ్లకూడా డ్రైవర్ జుట్టు పీకబోవడం, బేబీ జుట్టు ఎవరో గట్టిగా పట్టుకోవడం, కారు తలుపు ఎవరో లాగడం, హెల్ లెట్ లూజ్: డెవిల్స్ ఆన్ ది ఫ్రీ! నరకం గేట్లు తెరిచేరు! యములాళ్ళు విహారం చేస్తున్నారు.

అంతలో ఒక తెల్లని చీర! రెండు ఎరుపెక్కిన చేపలవంటి కళ్ళు! మెత్తని పూలతీగెల్లా రెండు సన్నటిచేతులు! జనాన్ని వత్తిగిలిస్తూ "ఆగండి! లెండి! దారి యివ్వండి! నా ఇష్టం నే వెళ్ళాలి!" అంటూ కారుకి దగ్గరగా వచ్చిన ఒక కిన్నెర కంఠం!

ఆమె కారెక్కింది "పదండి స్టార్టు చెయ్యండి!" అంది. అంతే జ్ఞాపకం ఉంది బేబీకి. ఎలా ఆ నరకంలోంచి బైటపడగలిగేడో గుర్తులేదతనికి. ఊరవతల బీచీరోడ్డున సరువుడు చెట్ల నీడలో కారు ఆపి రుమాల్తో ముఖం తుడుచుక్కూర్చున్నాడు నందూబేబీ. తుడుచుకొని అప్పుడు తిట్టడం స్టార్టు చేసేడు.

ఒడ్డున వరసగా నిల్చున్న సరువుడు చెట్లు స్నానానికి వచ్చిన ఋషుల్లా నిల్చున్నాయి. అన్ని కష్టాలు చూచినా తాతగారి సాశ్రునయనాల్లా సముద్రం తళతళలాడుతోంది. ఒడ్డున పరున్న మెత్తటి ఇసక, పాపాలు కడిగేసుకున్నట్లుగా సుఖ నిద్రపోతోంది. సముద్రుడి కోసం పరిగెట్టుకొచ్చిన చల్లగాలి సంతృప్తితో నిట్టూరుస్తోంది. సెలవులకి ఇంటికొచ్చిన కుర్రవాళ్ళా చంద్రుడు కలకల్లాడుతున్నాడు. అప్పుడే పూసిన మల్లెపువ్వులా పక్కఇంటి ఆడపిల్లలా చుక్కలు సిగ్గుపడుతున్నాయి.

"స్కౌండ్రల్కి రేపు చూపిస్తాను నా తడాఖా!" అన్నాడు నందూబేబీ.

అతను తిడుతున్న పావుగంటసేపూ ఏం మాట్లాడకుండా, అతని తిట్లకి అడ్డురాకుండా నిబ్బరంగా, నిశ్శబ్దంగా కూర్చుంది. ఆ తరవాత "ఎవర్నట్లా తిడుతున్నారు?" అని అడిగింది. ఆమె మాటలు వెండి తీగల్తో చుట్టిన అక్షరాల్లా ధ్వనించి కనిపించాయతనికి.

"వాడు నీ కేఁవౌఁతాడు?"

"మా మేనమాఁవఁ"

"వాణ్నే తిడుతున్నాను."

"ఎందుకూ?"

బేబీ జవాబివ్వలేదు. సరూ మళ్ళీ అడిగింది. అమర్యాదగా బిహేవ్ చేసినందుకు తిడుతున్నా నన్నాడు బేబీ. ఆ మాటకి సరూ ఊరుకొంది. కొంతసేపు అలా సముద్రంవైపు చూస్తూ కూర్చొంది. ఆ తరువాత ఆమె మరొక ప్రశ్నవేసింది.

"అడిగిన విధం బాగులేదుగాని అడిగినదాంట్లో తప్పుందా?" అంది.

"ఏఁవిఁటడిగేడు?"

"మర్చిపోయేరా?"

ఏదో పెళ్ళీ గిళ్ళీ అని నాన్సెన్సంతా పేలేడు. అంతే"

"మీరు నన్ను పెళ్ళిచేసుకొంటారో, లేదో కనుక్కోమన్నాడు అవునా?"

"రేపు అన్ని సంగతులూ తెలుస్తాయి వాడికి!" అన్నాడు బేబీ.

"ఇంతకీ అతని ప్రశ్నకి మీరేం సమాధానం చెప్తారు?"

ఆమె వేసిన ప్రశ్న నందూబేబీకి కొంతసేపటిక్కాని అర్థం కాలేదు. తరువాత ఆమెవైపు వింతగా, ఆశ్చర్యంగా చూస్తూ.

"జవాబు కావాలా నీకు?" అన్నాడు.

"జవాబు చెప్పలేరా?" అని అడిగింది సరూ.

ఆమె నలా చూస్తూనే చిన్న ఈల వేసేడు బేబీ "ఓహో! పేచీలకి దిగుతోందే పిల్ల!" అంది ఆ ఈల.

"అదేనా మీ జవాబు?" అని అడిగింది సరసిజాక్షి.

అతను వెటకారంగా నవ్వేడు.

డ్రైవరు కాస్త దూరంగా కారుకి వెనగ్గా రోడ్డువార కూర్చున్నాడు. కార్లో మాటామాటా పేల్తుండడం వింటున్నాడేకాని అతను కూర్చున్న చోట్నుంచి కదల్లేదు. మరొక పది నిమిషాలకి కారు తలుపు ధణేల్మని తెరుచుకొని ధన్నుమని మూసుకొంది. కోపంతో దుఃఖంతో వచ్చే కన్నీళ్ళు పైటచెంగుతో తుడుచుకొంటూ విసవిస నడుచుకొంటూ వెళ్ళిపోయే సరసిజాక్షి డ్రైవర్ని చూడకుండానే వెళ్ళిపోయింది. ఆమెని కొంత దూరం వెళ్ళనిచ్చి అప్పుడు నెమ్మదిగా లేచి కారు దగ్గరికి వెళ్ళేడు డ్రైవరు. వెళ్ళి స్టీరింగ్ దగ్గర కూర్చున్న బేబీతో "మాఁవఁ చేసిన బోధ నెత్తికెక్కింది సార్ లంజెకి!" అన్నాడు.

"నెత్తికెక్కితే కిందికి దింపేద్దాం! అదెంతపని!" అన్నాడు నందూబేబీ. తరువాత ఇద్దరితోనూ కారు కదిలింది.

పాత సరువుడు చెట్లు కదల్లేని కాళ్ళులేని ముసలాళ్ళల్లా మిగిలిపోయాయి. జోరుగా వచ్చిన చల్లగాలి ఎందుకోగాని వస్తూనే గోలున గోలపెట్టింది. ముసలాడి కోపంలా విరుచుకుపడ్డ కెరటాలు ఆడదాని శోకంలా అణగారిపోతున్నాయి. మోసపోయిన ఆడపిల్లల తడికళ్ళల్లా చుక్కలు సలసల కాగుతూ మిలమిల్లాడుతున్నాయి.

రెండు రోజుల్నాడు ఉదయం తొమ్మిది గంటలకి రావుగారు తమ బంగళా దక్షిణంవైపు వరండాలో సోఫాలో కూర్చొని కాఫీ తాగుతూ తమ ఎదట చేతులు కట్టుకొని నిల్చున్న డ్రైవర్ని "ఆఁ అయితే ఆ తరువాత ఏం చేసేడు అబ్బాయి" అని అడిగేడు.

"తిన్నగా అవతారంగారి దగ్గరికి వెళ్ళారండి" అన్నాడు డ్రైవరు చిరునవ్వు నవ్వుతూ.

"అయితే .... అయితే ఆ ముండవల్ల ప్రమాదం ఏం లేదుకద మనకి? అని అడిగేరు రావుగారు.

"నిన్న బ్రోతల్ కేసులో బుక్ అయిపోయిందండి!" అన్నాడు డ్రైవరు. డ్రైవర్పీ, రావుగారిపీ నాలుక్కళ్ళూ కలిసి నవ్వుకున్నాయి.

"అయితే ఫరవాలేదన్నమాటే!"

"అన్నమాటే"

"దాని మావగాడికి ఏవైనా ఇవ్వాలా మనం?" అన్నారు రావుగారు.

"ఇవ్వాలి అని చెప్పేసి, ఆ డబ్బుకూడా జేబులో వేసుకుందాం అనుకున్నాడు డ్రైవరు. కాని కొంచెం ఆలోచించేడు. పెద్దల్ని మాయ చెయ్యకూడదు. మాయచేస్తే ఎప్పుడో అప్పుడు బెడిసికొడుతుంది కదా!

"వాడికేం ఇవ్వక్కర్లేదు సార్! వాడు యెర్రి వెధవ! వాడికీవేళ మస్తుగా పట్టించేసి నీ మేనగోడల్ని కుర్రవెధవ మాయచేసి తగులుకున్నాడు. వాడి సంగతేదో ఇవాళ తేల్చేయాల్రా బావా! వాడి దగ్గిర నౌకరీ వెధవని కాబెట్టి నేనేం చెయ్యడానిక్కుదరదు. మరింక నువ్వే తగులుకోవాలి వాణ్ణి?" అని ముసిలాణ్ణి ఉసిగొలిపేసరికి పెద్దపులిలా కలియబడపోయేడు సార్! రూపాయి డబ్బుల్తో పనయిపోయింది సార్?" అన్నాడు డ్రైవరు. తనంత నిజాయితీగా ఉన్నందుకు చాలా పొంగిపోయేడతను. ఈ "కమ్యూనిస్టు" రోజుల్లో కూడా తమవంటి పెద్దవార్ని నమ్ముకొని విశ్వాసంగా ఉండే నౌకర్లున్నందుకు రావుగారి కళ్ళు ఆనందాశ్రువుల్తో నిండిపోయేయి.

అధికారీ, అతని బంటూ ఆవిధంగా సంతృప్తికరంగా, హాపీగా మాటాడుకొంటూంటే కాస్త ఎడంగా చక్కని బల్లమీద పడుకొని గులాబీ పూలగాలి పీలుస్తూ చిన్న నిద్రపోదామనుకున్న లకీలూసీ నిద్రపట్టక చికాకుపడుతున్నది. నాలుగు రోజుల్నుంచీ ఇదే గోలగా ఉంటోంది. పెదబాబూ, డ్రైవరూచేసే "సంభాషణ గోల" కాదు. పక్క పూలతోటలో మైనగోర్లు చేసే గోల.

లకీలూసీ ప్రొద్దునవేళ కాస్త నిద్రపోతేగాని మరింక రోజల్లా హాపీగా హాయిగా పిల్లిగా ఉండలేదు. నాలుగు రోజులయి తను సరిగ్గా పడుకొనే సమయానికే ఆ రెండు జతల మైనగోర్లు వచ్చి అల్లరి చేస్తున్నాయి. ఎక్కడో ఏ అడివిలో ఏ చెట్లకో బతక్క సరిగ్గా ఇక్కడికే ఈ పూల తోట్లోకి వచ్చి పచ్చగడ్డి చాటులో, పూలమొక్కల మాటులో దొర్లుతున్నాయి. ఈ తోటంతా వాటి కోసమే వేయించినట్టు : ఇక్కడొక పిల్లిపిల్లయినా లేనట్టు!

అయినా మొన్న ఆ పార్కులో కోడి మనకీ ముప్పు తెచ్చిపెట్టింది అనవసరంగా భయపడిపోయేం మనం. తిన్నగా వచ్చి డైరెక్టగా అటాక్ ఇచ్చేస్తుందనుకోలేదు. రెడీగా లేకపోయేం మనం. అయినా అలాంటి వెధవల్తో మనం ఎప్పుడూ ముఖాముఖీ దెబ్బలాట పెట్టుకోకూడదు చాట్నుంచి ఉరకాలి. దొంగదెబ్బకి ఏ కత్తుల కోడైనా సరే, ఎంత నిప్పులకోడైనా సరే ఎప్పుడో అప్పుడు దొరక్కపోదా!?

అయినా ఆ సంగతి తరవాత చూసుకోవచ్చు. కోడికి భయపడి పోయేం అన్నెప్పి ముందు ఈ మైనగోర్లు కూడా మన్ని అనాడీ చేసీకుండా కాసుకోవాలి.

అని నెమ్మదిగా బల్లదిగి పూలమొక్క చాటుకి అసలైన పిల్లిలా నడిచింది లకీలూసీ.

తొమ్మిదిం పావయింది. డ్రైవరు డబ్బూ, సెలవు తీసుకుని షెడ్డులోకి పోయేడు, రావుగారు కాఫీ సేవించిన హాయిలో ఏదో ఆలోచిస్తూ చిరునవ్వు నవ్వుకొంటూ చేతులు వెనక్కి విరిచికట్టుకొని సోఫాలో బాగా చేరబడ్డారు, అతని చెవిలో కిచకిచమనీ, కీచుకీచుమనీ, "కీచ్" "కీచ్" అనీ ఏవో ధ్వనులు వినపడుతున్నాయి. అతనికవన్నీ కలలో చిలకలు చేసిన కలకల చప్పుళ్ళలా హాయిగా వినిపిస్తున్నాయి.

అంతలో వికసించిన రోజా పుష్పంలా వరండాలోకి వచ్చిన మిస్ మాలినీరావ్ కెవ్వున కేక వేసింది. రావుగారు తుళ్ళిపడి లేచి "ఏఁవిఁటమ్మాయ్? ఏమిటది? అని గాభరాగా కేకలేసేరు. జవాబుగా ఆమె తోటవైపు చేయిజాచి చూపించింది. రావుగారు అటువైపు చూసేరు.

ఓ మైనగోరుని నోటితో కరుచుకొని మంచులా మెరుస్తూన్న లకీలూసీ చోటా పులిలా గర్వంగా, అతి నిశ్శబ్దంగా తోటలో పూటగడ్డి మధ్యలోంచి పూలచెట్ల వారకి పోతున్నాడు.

ఆ దృశ్యం చూసి రావుగారివంటి శాంత గంభీరులు కూడా చలించకుండా ఉండలేక పోయ్యేరు. లూసీకి ఆ సమయంలో ఎంత ఠీవి వచ్చింది! ఎంత దర్జా! ఎంత హుందాతనం! భయంకరమైనదే కాని అందులో ఎంతటి అపురూపమైన అందం ఉంది! వ్హాట్ ఎ టెరిబుల్ బ్యూటీ!

"అఫ్‌కోర్స్! ఆ పిట్టన్చూసి మనం విచారించాఁలనుకోండి! పూర్ పిట్టా! - అయామ్ సారీ - పూర్ బర్డ్!" అనుకున్నారు రావుగారు.

"అమ్మాయ్! మాలీ! విచారించకమ్మా? ఏ జీవికి ఆ ఆహారం. భగవంతుడే ఏర్పాటు చేసేడు. మనం దానికి అడ్డుపడకూడదు. మన తిండికి ఎవరైనా అడ్డుపడితే మనం ఊరుకుంటావా! చెప్పు : అంచేత విచారించకు!" అన్నారు రావుగారు.

ఆ మాటలన్నాక ఆయనెందుకోగాని చిరాకుపడ్డాడు. తమకీ, జంతువుకీ సామ్యం తెచ్చుకోడం బావులేదేమోననిపించిందతనికి. ఛ - మంచి సిమిలీ మరేదైనా వాడవలసింది. మంచి ఉపమలు వాడకపోతే ఇలాగే ఫిలాసఫీలు దొరికిపోతాయి.

రావుగారు చిరాగ్గా నిల్చున్నారు. మిస్ మాలినీరావ్ మాత్రం ఆ దృశ్యం పూరాగా చూసేక మళ్లీ కెవ్వున కేక వేసింది.

"డాడీ! మన లూసీ అహింస పిల్లి కాదు. హి ఈజ్ నాట్ ఎ నాన్ వయలెన్ట్ కాట్! నొ నో నొ! నెవర్! కాదు కాదు. అహింస పిల్లి ఎన్నటికీ కాదు?" అని అరిచింది మాలిని. షోకైన తన పెంపుడు పిల్లి కూడా జాతైన అన్ని పిల్లుల్లాగే ఉన్నందుకామె నిలువునా పులకించి పోయింది. ఆమె నవనీత కోమల హృదయం సంతోషంతో కరిగిపోయింది. ఆమె ఆ సమయంలో అపురూపమైన టెరిబల్ బ్యూటీతో మురిసిపోయింది.

***ఆంధ్రజ్యోతి వారపత్రిక, 22-10-1971***